రేపటి నుంచి కవాడిపల్లిలో మహోత్సవాలు

- కంఠమహేశ్వర స్వామి, సురమాంబా దేవి విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణం



అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 11 : మండలంలోని కవాడిపల్లి గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వర స్వామి, సురమాంబాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు స్వామి వారి కల్యాణోత్సవాలు ఈ నెల 13 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నామని గౌడ సంఘం అధ్యక్షుడు బొడిగె వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. 13న అష్టదిగ్బంధనం, పొలిమేర కట్టు, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, 14న విగ్రహాల ఊరేగింపు, జలాధివాసం, సాంస్కృతిక కార్యక్రమాలు, 15న ఇంటింటా జలబిందెలు తీయడం తదితర ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు. 16న బోనాల ఉత్సవాలు, స్వామి వారి కల్యాణం, భక్తులకు అన్నదానం తదితర ప్రత్యేక పూజలు, 17న ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

వీరభద్రస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 11: అమావాస్య సందర్భంగా షాద్‌నగర్‌లోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలోని వీరభద్రస్వామికి ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. స్వామివారికి విశేష అభిషేకాలను నిర్వహించారు. అమావాస్య రోజున స్వామివారికి పూజలు చేయడం ద్వారా సకల శుభాలు కలుగుతాయన్నారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు భక్తిపాటలను ఆలపించారు. భక్తులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

ఆదిబట్ల, మార్చి 11: కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆదిబట్ల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు అమలు కాని హామీలను ఇచ్చి అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటివరకు రైతులకు రైతుబంధు ఇవ్వలేదన్నారు. రుణమాఫీ జాడే లేదన్నారు. వేసవిలో పంటలు ఎండిపోతున్నాయ ని, విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయ డం లేదన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రాష్ట్ర ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా స్పందించి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

- ఆరు రోజులపాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

కడ్తాల్ : చరికొండ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం

కడ్తాల్, మార్చి 11 : మండల పరిధిలోని చరికొండ గ్రామంలో వెలసిన రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 17వ తేదీ వరకు ఆరు రోజులపాటు ఉత్సవాలు జరుగనున్నాయి. వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు, నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో మోహన్‌రావు తెలిపారు. ఉత్సవాలను తిలకించేందుకు కందుకూరు, ఆమనగల్లు, యాచారం, ఇబ్రహీంపట్నం, మాడ్గుల్ మండలాల నుంచి భక్తులు తరలివస్తారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

చరికొండ గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం స్వామి వారికి అభిషేకం, రాత్రి స్వస్తివాచకం, ఋత్విగ్వరణం, అంకురార్పణం, 13న ధ్వజారోహణం, రాత్రికి భేరి పూజ, దేవతాహ్వానం, 14న మోహినీ సేవ, విష్ణుసహస్రనామం అర్చనలు, రాత్రి గరుడ సేవ, 15న స్వామి వారి కల్యాణం, రాత్రి రథోత్సవం, 16న స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చనలు, ఆంజనేయస్వామి అష్టోత్తర నామావళి, రాత్రి అశ్వవాహనంపై స్వామి వారి విగ్రహ ఊరేగింపు, లంకాదహనం, 17న పూర్ణాహుతి, చక్రతీర్థం, బండ్లపూజలు, రాత్రి పుష్పయాగం, ద్వాదశ ఆరాధన, దేవతా విసర్జనం, శేషవాహనం, మూగబలి, పవళింపు సేవలతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు వివరించారు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో ఎస్‌బీఐ వద్ద నిరసన

ఎస్‌బీఐ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

తుర్కయాంజాల్, మార్చి 11: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్బీఐ వెంటనే బహిర్గతం చేయాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగాళ్ల భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఎం తుర్కయాంజాల్ మున్సిపల్ కన్వీనర్ డి.కిషన్ ఆధ్యక్షతన మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌బీఐ బ్రాంచ్ ఎదుట ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ఎస్బీఐ ఎన్నికల బాండ్లను బహిర్గతం చేయకపోవడం దారుణమన్నారు. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తే కస్టమర్ల విశ్వాసం కోల్పోతుందని తెలిపారు. ఎస్బీఐ వెంటనే ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సామెల్, జగదీశ్, జగన్, నర్సింహ, రవికుమార్, ప్రకాశ్ కారత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ ప్రియాంకాగౌడ్ తదితరులు

నందిగామ, మార్చి11 : నందిగామ మండలం వెంకమ్మగూడ గ్రామంలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ ప్రియాంకాగౌడ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్యామ్‌సుందర్‌రెడ్డి, చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, వెంకమ్మగూడ మాజీ సర్పంచ్ రజనీత పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను అవమానించడం సిగ్గుచేటు

యాచారం, మార్చి11: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిని దైవకార్యంలో నేలపై కూర్చోబెట్టి అవమానపర్చడం సిగ్గుచేటని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మండలి గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. యాదగిరిగుట్టలో ముఖ్యమంత్రి, మంత్రులు కుర్చీల్లో కుర్చోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను నేల మీద కూర్చోబెట్టి అవమానపరచడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం, ఇదేనా ప్రజాపాలన? అని ఆయన ఎద్దేవా చేశారు. దళిత ఉపముఖ్యమంత్రిని అవమానపర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

క్షమాపణ చెప్పాలి

ఇబ్రహీంపట్నం : ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జరిగిన అవమానం బాధాకరమని, వెంటనే సీఎం, మంత్రులు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజాపాలనలో ఉన్నత కులాలకు చెందిన మంత్రులకు పైన, ఉప కులాలకు చెందిన మంత్రులను నేలపై కూర్చోబెట్టడం ఎంత వరకు సమంజసమని అన్నారు.

ఇబ్రహీంపట్నంరూరల్ : యాదాద్రి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కుర్చీలపై కూర్చుని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కింద కూర్చోబెట్టడం అవమానకరమని ఎస్సీ మోర్చా జిల్లా నాయకుడు బండి మహేశ్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బూడిద నర్సింహారెడ్డి, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మైలారం విజయ్‌కుమార్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకుడు శ్రీనివాస్ ఉన్నారు.

మొయినాబాద్ : యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను అవమానించడం బాధాకరమని బీఎస్పీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రాజమహేంద్ర వర్మ అన్నారు. డిప్యూటీ సీఎంను కింద కూర్చోబెట్టి తీవ్రంగా అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే రెడ్డీల పార్టీ అని, ఆ పార్టీ దళితులకు అన్యాయం చేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ఘటనను ఖండించాలని కోరారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దళిత సమాజం తగిన బుద్ధి చెప్పాలన్నారు.

శివారు కాలనీలకు తాగునీరు

మన్సూరాబాద్, మార్చి 11: శివారు ప్రాంత కాలనీలకు మంచినీరు అందించేందుకు త్వరలో పైపులైన్లను వేయిస్తామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధి శ్రీఇంద్రప్రస్తకాలనీలో మాతృభూమి ఉత్సవ సమితి, సిటిజన్ డెవలప్‌మెంట్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో 23 కాలనీలకు చెందిన సమస్యలపై సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ఆనంద్‌నగర్ నుంచి ఫతుల్లాగూడకు వెళ్లే మార్గంలో రోడ్డు వెడల్పు చేపట్టాలని, వీధి దీపాలు, మంచినీటి పైపులైన్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని, సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థను జనాభాకు అనుగుణంగా పునరుద్ధరించాలని, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కాలనీలవాసులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. మంచినీటి పైపులైన్ల ఏర్పాటు కోసం జలమండలి ఎండీని కలవడం జరిగిందని.. కాలనీలకు అదనపు పైపులైన్లను మంజూరు చేయడం జరిగిందన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్, మార్చి 11 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు భవాని రాములు అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం మృతి చెందాడు. సోమవారం మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి స్థానిక నాయకులతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి వ్యక్తిగతంగా రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు మల్లయ్య, భిక్షపతి, నర్సింహ, చెన్నయ్య, యాదయ్య, పాండు పాల్గొన్నారు.

యువతకు నేడు క్రీడాపోటీలు

ఆమనగల్లు, మార్చి 11: నెహ్రూ యువ జన కేంద్రం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యం లో నేడు మండలంలోని యువతీయువకులకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీ వో ఫారుక్‌హుస్సేన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 8.30 గంటలకు ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 18 నుంచి 30 ఏండ్ల వయసున్న యువతీయువకులకు 500 మీటర్ల రన్నింగ్ రేస్ ఉంటుందన్నారు. అదేవిధంగా వాలీబాల్, ఖోఖో, క్యారమ్స్ పోటీలు జిల్లా బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం రెండు గంటలకు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న వారు నేడు ఉదయం బాలుర జడ్పీహెచ్ఎస్‌లో పీడీలు ఆనంద్, శ్రీధర్‌లను కలిసి పేర్లు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తొద్దు

- ఎంపీపీ సుకన్య

సమావేశంలో మాట్లాడుతున్న మండల పరిషత్ అధ్యక్షురాలు సుకన్య

యాచారం, మార్చి11: వేసవిలో తాగునీటి ఎద్దడిని రానివొద్దని ఎంపీపీ సుకన్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముందుగా ఎంపీటీసీలు రాకపోవడంతో గంటపాటు వాయిదా వేశారు. అనంతరం ఫోరం సరిపోవడంతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయం, విద్యా, వైద్యం, విద్యుత్, ఆర్ డబ్ల్యూఎస్ తదితర అంశాలపై చర్చించారు. మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపీపీ సుకన్య మాట్లాడుతూ..వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. దీనికోసం అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైతే గ్రామ పంచాయతీ బోర్లను మరమ్మతు చేయించాలని ఆమె సూచించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. సమావేశంలో జడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో ఉమారాణి, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహాయం మరువలేనిది

విద్యార్థులకు పరీక్షా ప్యాడులను అందజేస్తున్న ఉపాధ్యాయులు

మంచాల, మార్చి 11: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు చేస్తున్న సహాయం మరువలేనిదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మంచాల జిల్లా పరిషత్ పాఠశాలకు విర్యాబ్ అనిమల్ హెల్త్ ఇండియాకు చెందిన రీజినల్ బిజినెస్ మేనేజర్ సిరాజుద్దీన్ రూ. 53వేల విలువైన ఆక్వాగార్డ్ వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. అలాగే బడంగ్‌పేటకు చెందిన భీమా 10వ తరగతి విద్యార్థులకు పరీక్షాప్యాడు, పెన్నులు, పెన్సిల్‌తో కూడిన కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు కావాల్సిన ప్యూరిఫైడ్ నీటి వసతులను కల్పించిన సంస్థను అభినందించారు. కార్యక్రమంలో ఏరియా బిజినెస్ మేనేజర్ శివకుమార్‌రెడ్డి, మంచాల ప్రత్యేకాధికారి డాక్టర్ సుధారెడ్డి, ఉపాధ్యాయులు సలీంఖాన్, తుల్జారాం, జగన్, రాజమల్లయ్య, కేశవరావు, రాఘవేందర్, సీఆర్పీ జగదీశ్, యువకులు అశ్వల బాల్‌రాజ్, జక్క శేఖర్ పాల్గొన్నారు.

సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తాం

కడ్తాల్, మార్చి 11 : మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ భూముల సర్వే వాయిదా పడింది. సోమవారం సర్వేనంబర్ 120లో గల ఆలయ భూమిని రెవెన్యూ అధికారులు కృష్ణయ్య, పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. భూమికి కొలతలు మాత్రమే చేసి హద్దు రాళ్లు ఏర్పాటు చేయకపోవ డంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుల సూచన మేరకు వారం లోగా భూమిని సర్వే చేయించి హద్దులను గుర్తించి కంచెను ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. కాగా సర్వేనంబర్ 120లో ఆలయానికి 15.31 ఎకరాల భూ మి ఉండగా, అందులో 26 గుంటలు కబ్జాకు గురైందని స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు ఇటీవల అధికారులను కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మోహన్ రావు, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సభ్యులు శాయిరెడ్డి, జంగారెడ్డి, టీంకులాల్‌నాయక్, భీక్యానాయక్, అర్చకుడు శ్రీధర్‌పంతులు ఆంజనేయులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ భూముల వద్ద గ్రామస్తులు, అధికారులు

ఉపాధ్యాయినులకు సన్మానం

యాచారం, మార్చి11: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ వసతి గృహంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయినుల సన్మానించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పి. జగన్నాథం మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే సమాజం అన్నిట్లో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ నాయకులు సలువాల నర్సింహ, ఆంజనేయులు, మోతీలాల్, ధన్‌రాజ్, అలివేలు, సరిత, మంజుల, అరుణమ్మ, భాగ్య మ్మ, యాదయ్య, మధార్, జగదీశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆమనగల్లు. మార్చి11 : మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామానికి చెందిన ప్రమోద్ కూతురు తన్వీశ్రీ (2) గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర పుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రూపం వెంకట్‌రెడ్డి, బన్నే శేఖర్, సుమన్‌నాయక్, ప్రశాంత్, తిరుమలేశ్, బొడ్డుపల్లి మహేశ్, నరేశ్ పాల్గొన్నారు.

బస్సులు నడపాలని డీఎంకు వినతి

డిపో మేనేజర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 11: బండ్లగూడ బస్సు డిపో పరిధిలోని పరిసర గ్రామాలకు బస్సు సర్వీసులు నడపాలని తట్టిఅన్నారంలోని వివిధ కాలనీల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం డిపో మేనేజర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. నాగోల్, బండ్లగూడ, తట్టిఅన్నారం, కుంట్లూరు మీదుగా పెద్దఅంబర్‌పేట వరకు సర్వీసులు నడపాలని కోరారు. నాగోల్ నుంచి కుంట్లూరు మీదుగా హయత్‌నగర్‌కు మరో బస్సును నడపాలని విన్నవించారు. పెద్దఅంబర్‌పేటలోనే మున్సిపల్ కార్యాలయం ఉన్నదని, రెవెన్యూపరంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లాలనుకునే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. అదే మార్గంలో కాలేజీలు, పాఠశాలలు సైతం ఉన్నాయని, విద్యార్థులు, ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సర్వీసులు నడపాలని కోరారు. కార్యక్రమంలో తట్టిఅన్నారంలోని వివిధ కాలనీల ప్రతినిధులు చరణ్‌రెడ్డి, చంద్రశేఖర్‌గుప్తా, ఉన్నీస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

తుర్కయాంజాల్, మార్చి 11 : మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మాజీ వార్డు సభ్యుడు సామ భీంరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలనీ వాసులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో రెవెల్లి యాదగిరి, శ్రీనివాస్, ప్రశాంత్, నర్సింహ్మ, నందీశ్వర్, రమేశ్, అనిశ్‌రెడ్డి, జగదీశ్వర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

తోలుకట్టలో ఉచిత వైద్య శిబిరం

మొయినాబాద్, మార్చి11: మండల పరిధిలోని తోలుకట్ట గ్రామంలో సోమవారం బొలిగిద్ద లక్ష్మమ్మ, బొలిగిద్ద బాలరాజు జ్ఞాపకార్థం హోప్ ఆఫ్ అండ్ ఆశ్రమం సంస్థ ద్వారా మాజీ సర్పంచ్ సత్యనారాయణ, వధువు సంఘం చర్చి బిషప్ రెవరెండ్ కిష్టఫర్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అదే విధంగా 350 మందికి కంటి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, మహ్మద్ అమీత్‌ఖాన్, జంగయ్య, శంకరయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.